# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 13 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## స్థానిక ఎన్నికలకు 36 గుర్తులు ఖరారు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం 36 గుర్తులను ఎంపిచేసింది. వీటిలో పచ్చిమిరపకాయ, ఫుట్‌బాల్, జావెలిన్ త్రో, ఏసీ, ఫ్రిజ్, రోలు, రోకలి, పనసపండు, యాపిల్ వంటి గుర్తులు ఉన్నాయి. ఈ గుర్తులు గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు కేటాయిస్తారు. అభ్యర్థులను సులభంగా గుర్తించేందుకు ఈ గుర్తులు సహాయ పడతాయని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు. పంచాయతీ ఎన్నికలు పార్టీలకతీతంగా, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పార్టీ గుర్తులతో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జాతీయ, ఇతర ప్రధాన పార్టీలకు రిజర్వు గుర్తులతోపాటు ఈ ఉచిత గుర్తులను విడుదల చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

# న్యాయవ్యవస్థకు సంస్కరణలు అవసరం

- న్యాయ ప్రక్రియలో ఆలస్యం వల్ల నిర్దోషులు కూడా జీవిత కాలం బాధపడుతున్నారు
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్
- ఘనంగా నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత న్యాయవ్యవస్థ "చిత్రవిచిత్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఇది తీవ్రంగా సంస్కరణలకు అవసరమై ఉన్న వ్యవస్థ" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. హైదరాబాద్ సమీపంలోని నల్సార్ యూనివర్శిటీలో జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "భారత న్యాయ వ్యవస్థలో ఆలస్యం పెద్ద సమస్య. కొన్ని కేసులు దశాబ్దాల తరబడి నడుస్తుంటాయి. పలువురు నిర్దోషులు దశాబ్దాల పాటు అండర్‌ట్రయల్ ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నారు. చివరికి వారు నిర్దోషులుగా తేలినా, వాళ్ల జీవితాల్లో వచ్చిన నష్టం ఏం చేయలేము" అని న్యాయమూర్తి గవాయ్ ఆవేదన వ్యక్తం చేశారు.

న్యాయవ్యవస్థలో లోపాలు బలంగా వేరుకుపోయాయని ఆయన గుర్తించారు. అయినా కూడా దేశం పట్ల ఆశతో ఉన్నానని చెప్పారు. "మన ఉత్తమ ప్రతిభ ఈ సమస్యలకు పరిష్కారాలు చూపగలదు. ఈ వ్యవస్థను సంస్కరించాలనే బాధ్యతను యువ న్యాయవాదులు భుజాన వేసుకోవాలి" అని ఆకాంక్షించారు. "మీరు మీ మార్గదర్శులను ఎంచుకునేటప్పుడు వారి ప్రభావాన్ని కాదు... నిజాయితీని ప్రమాణంగా పెట్టుకోండి" అని అన్నారు. విదేశాల్లో విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు స్కాలర్‌షిప్ మార్గం ద్వారా వెళ్ళాలని, తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా చూసుకోవాలన్నారు.

కొన్నిసార్లు కేసులు దశాబ్దాల తరబడి నడుస్తుంటాయి. ఈ కారణంగా నిర్దోషులు కూడా జీవితకాలం ఖైదు అనుభవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఈ న్యాయవ్యవస్థను నమ్ముతాను. దేశ యువత, న్యాయ రంగానికి కొత్తగా వస్తున్న వారు దీన్ని మార్చగల సామర్థ్యం కలవారు" అని నమ్మకాన్ని వ్యక్తం చేశారు."మీ మార్గదర్శకులను వారి నిజాయితీ ఆధారంగా ఎంచుకోండి–ప్రభావం కాదు" అన్నారు. స్కాలర్‌షిప్‌ల ద్వారా విదేశాల్లో చదువులు కొనసాగించాలని సూచించారు.

కొన్ని సందర్భాల్లో న్యాయ వృత్తి వ్యక్తివాదాన్ని, ఒంటరి స్వభావాన్ని పెంచే ప్రమాదముందని హెచ్చరించారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా నుంచి వచ్చిన ఒక అధ్యయనాన్ని ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. న్యాయ వృత్తికి సమాజంలో ఒక ఉన్నత స్థానముందని పేర్కొన్నారు. ఇదే సమయంలో జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాలు, ఇతర సంస్థల కంటే మెరుగ్గా ఉన్నాయని గుర్తు చేశారు. వాటి నుంచి పూర్తి స్థాయిలో ఫలితాలు రాబట్టాలని సూచించారు. కేవలం ఉన్నత నైపుణ్యాల మీదనే ఆధారపడకుండా సృజనాత్మకత, నిర్మాణాత్మక పద్ధతులను అనుసరించటం ద్వారా న్యాయవాద వృత్తిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మారుతున్న ప్రపంచంలో సాంకేతిక పరిణామాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. కాలగమనంలో ఈ వృత్తి కూడా ఎంతో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అయితే బలమైన, చట్టపరమైన పునాదులపైనే ఆధారపడి ముందుకు సాగాలని ఆయన న్యాయ విద్యార్థులకు సూచించారు. మరోవైపు నైతిక విలువలను పాటించే సమర్థులైన న్యాయవాదులను రూపొందించడంలో లా యూనివర్సిటీలు కీలక పాత్రను పోషించాలని జస్టిస్ గవాయ్ అభిలషించారు. విదేశీ డిగ్రీలను అభ్యసించటంపై పెరుగుతున్న ధోరణిని ఆయన ప్రస్తావిస్తూ...మిత్రులు, సహచరులు చెప్పారనో, ఎవరో ఒత్తిడి చేశారనే కారణాలతో విదేశీ విద్య వైపు మొగ్గు చూపొద్దని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు, మనకున్న అర్హతలను కూడా బేరీజు వేసుకుని ఈ విషయంలో ముందుకు పోవాలని కోరారు. దేశ న్యాయ వ్యవస్థ ప్రయోజనాలను కాపాడాలనీ, ఇక్కడి ఉత్తమ న్యాయవాదులను నిలుపుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాలకు సూచించారు. ఇందులో భాగంగా ఎల్.ఎల్.ఎమ్.లాంటి కోర్సులపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాలని కోరారు. అనంతరం న్యాయ విద్యలో డిగ్రీలు, డిప్లొమాలు,పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ), ఎల్ఎల్ఎం (మాస్టర్ ఆఫ్ లాస్), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌తోపాటు ఇతర కోర్సుల్లో పట్టాలు పొందిన పలువురు విద్యార్థులకు జస్టిస్ గవాయ్, సీఎం బంగారు పతకాలను, జ్ఞాపికలను అందజేశారు. ఈ సమావేశానికి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ అధ్యక్షత వహించగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ తదితరులు హాజరయ్యారు.

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు
# పరస్పరం గౌరవించుకోవాలి

- అప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నడుస్తాయి
- అధిక వడ్డీల భారం రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయి
- వడ్డీల చెల్లింపులకు ఆదాయాన్ని ఖర్చు చేయాల్సిన పరిస్థితి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎంను కలిసిన ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సమాఖ్య విధానంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకున్నప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ గారు ముఖ్యమంత్రి గారిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి కోసం చేపట్టిన, చేపడుతున్న వివిధ పథకాలు, ప్రాజెక్టులతో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను ముఖ్యమంత్రి వివరించారు. కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం సహకరించుకున్నప్పుడే రాష్ట్రాలు అభివృద్ధి చెంది తద్వారా దేశం పురోభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

"రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం పలు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఆవలివైపున రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం. ఔటర్ రింగ్ రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేస్తూ రేడియల్ రోడ్లను ప్రతిపాదించాం" అని మౌలిక సదుపాయాల కల్పనపై వివరించారు. తెలంగాణ అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక శాతం వడ్డీల కారణంగా తిరిగి చెల్లింపులు భారంగా మారి రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోంది. అధిక వడ్డీకి తీసుకున్న రుణాలపైన వడ్డీ తగ్గించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంకల్పానికి బీసీలు అండగా నిలవాలి



- రిజర్వేషన్లను సవాల్ చేస్తూ ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే నిష్ణాతులైన న్యాయవాదులను నియమిస్తాం
- కుల గణన డేటా వంద శాతం డిజిటలైజ్ చేశాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పానికి బీసీలంతా అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అందరం కలిసి ఒక రక్షణ కవచంలా బీసీ రిజర్వేషన్లను కాపాడుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. మంత్రి కొండా సురేఖ , సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, విప్ ఆది శ్రీనివాస్, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ గారు, బీసీ సంఘాల ప్రతినిధులు వేర్వేరుగా ముఖ్యమంత్రిని కలిశారు.వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని రాష్ట్ర మంత్రిమండలి తీర్మానించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. "బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న సంకల్పంతోనే ఇంతకాలం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశాం. నెల రోజుల్లోగా స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించి పెంచరాదని గత ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసింది. ఆ చట్టంలో 50 శాతం గరిష్ట నిబంధనను సవరిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించాం. రిజర్వేషన్లను సవాలు మిగితా 4వ పేజీలో

## ఇంధన స్విచ్‌లు ఆగిపోవడంతోనే ప్రమాదం

- ఇంధన నియంత్రణ స్విచ్‌లు 'కట్ ఆఫ్' స్థితికి మారిన వెంటనే ప్రమాదం
- ఎలాంటి కుట్ర కోణం లేదు.. పక్షి ఢీకొట్టలేదు
- అహ్మదాబాద్ విమానం దుర్ఘటనపై ఏఏఐబి ప్రాథమిక నివేదికలో అంశాలు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ గ్యాట్‌విక్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా AI 171 విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్పకూలిన ఘటనపై విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది.

బోయింగ్ 787–8 విమానం టేక్ ఆఫ్ అయిన కొన్ని సెకన్లలోనే రెండూ ఇంజిన్లకు సంబంధించిన ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఒక్క సెకనులో RUN నుంచి CUT-OFF స్థితికి మారినట్లు నివేదికలో వెల్లడించారు. ఈ కారణంగా ఇంజిన్‌లకు ఇంధనం ఆగిపోయి విమానం 30 సెకన్ల వ్యవధిలోనే కుప్పకూలిపోయిందని వివరించారు. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలట్ మరోపైలట్‌ను "నీవే ఫ్యూయల్ కట్ చేశావా?" అని ప్రశ్నించగా.. "లేదు.. నేనేం చేయలేదు" అని సమాధానం ఇచ్చినట్లు తేలింది. ఈ విమానాన్ని సహ పైలట్ క్లైవ్ కుందర్ నడుపుతుండగా, సుమీత్ సబర్వాల్ మానిటరింగ్ చేస్తున్నారని, ఇద్దరికీ తగినంత అనుభవం ఉందని పేర్కొన్నారు.

ఇంజిన్ పవర్ కోల్పోయిన వెంటనే పైలట్లు తిరిగి స్విచ్‌లను 'RUN' స్థితికి మార్చినా, అతి తక్కువ ఎత్తులో ఉండడంతో విమానం గాల్లోకి ఎగిరేందుకు వీలుకాలేదు. ఈ స్విచ్‌లు ఎర్రర్‌ప్రోన్ కాదని, అవి తప్పుగా ఆన్/ఆఫ్ అయ్యే అవకాశమే లేదని విమాన నిపుణులు చెప్పారు. వాటిని ఆఫ్ చేయాలంటే పైలట్ ప్రత్యేకంగా లాక్ ఎత్తి పైకెత్తాల్సి ఉంటుంది. అయితే ఈ మార్పు ఎలా జరిగింది అన్న దానిపై స్పష్టత ఇంకా రాలేదని నివేదిక పేర్కొంది.

విమాన థ్రాటిల్ కంట్రోల్ మాడ్యూల్ 2019, 2023లో మార్చినట్లుగా రికార్డులున్నా.. ఫ్యూయల్ స్విచ్‌కు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులూ లేవని తేలింది. అమెరికా FAA 2018లో ఇచ్చిన ఒక హెచ్చరికాత్మక బులెటిన్‌ను ఎయిర్ ఇండియా పట్టించుకోకపోయిందని నివేదిక పేర్కొంది. విమానానికి సంబంధించిన ఫ్లాప్ సెట్టింగులు, బరువు వంటి విషయాలన్నీ సరియైన రీతిలో ఉన్నాయని, ఎలాంటి వాతావరణ అవరోధాలు లేవని స్పష్టం చేశారు.

అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని బౌజర్ల నుంచి తీసిన ఫ్యూయల్ నమూనాలు సరైనవే అని నిర్ధారణ కావడంతో, ఫ్యూయల్ కంటామినేషన్ కారణమేమీ కాదని తేలింది.

## దేశ సమగ్రతను కాపాడిన మహానాయకుడు అంబేద్కర్

- ఆర్టికల్ 32 రాజ్యాంగానికి ప్రాణం: సీజేఐ గవాయ్
- రాజ్యాంగంలో స్థిరత్వం, సర్దుబాటు సమన్వయం
- ఓయూ సామాజిక న్యాయానికి వేదికగా నిలుస్తోంది
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్

వివరాలు 4వ పేజీలో

## అమెరికా మళ్లీ సుంకాల మోత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు దేశాలపై మళ్లీ సుంకాల మోత మోగించారు. మెక్సికో తోపాటు ఐరోపా యూనియన్ (ఈయూ) దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు విధించారు. ఆగస్టు 1 నుంచి ఇవి అమలు లోకి వస్తాయని ప్రకటించారు. అమెరికాతో ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు విధించడం విశేషం. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఈయు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌లకు లేఖలు రాశారు. అనధికార వలసదారులను , ఫెంటానిల్ అనే మాదక ద్రవ్యాన్ని అరికట్టడంలో మెక్సికో విఫలమైందని ఆ లేఖలో పేర్కొన్నారు. నార్కో మాదక ద్రవ్యాల రవాణ కేంద్రంగా మారకుండా నార్త్ అమెరికాను కాపాడలేక పోతోందని ఆరోపించారు.

## బాలాపూర్ లో చిరుతల సంచారం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బాలాపూర్ శివారు ప్రాంతాల్లో చిరుతల సంచారం కలకలం సృష్టిస్తోంది. బాలాపూర్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ ప్రాంగణంలో చిరుతల సంచరించినట్టు స్థానికులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండో రోజుల క్రితం రెండు చిరుతలు సంచరించాయని ఓ సెక్యూరిటీ గార్డు గుర్తించారు. సిసి కెమెరాల్లో చిరుతలు సంచిరించినట్టు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. చిరుతలు సంచరించడంతో బాలాపూర్ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిఫెన్స్ అధికారులు హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులు చిరుతలను బంధించే పనిలో నిమగ్నమయ్యారు. డ్రోన్ల సహాయంతో చిరుతలను గుర్తిస్తున్నారు.

## ఇరాన్‌లో బాలికపై లైంగికదాడి, హత్య

- దోషికి బహిరంగ మరణశిక్ష

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఓ బాలికపై లైంగికదాడి చేసి హత్య చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం .. బుకాన్‌కు చెందిన ఓ బాలికను లైంగికదాడి చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని భాధిత కుటుంబ సభ్యులు , ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా, సుప్రీం కోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్టు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. తీవ్రత ఎక్కువ ఉన్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలు చేస్తారు. మానవహక్కుల సంఘాల ప్రకారం.. ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలు చేసే దేశాల్లో ఇరాన్ రెండోస్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.

## బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగానే అమలు చేయాలి



- ఆర్డినెన్స్‌లు, జీవోల ద్వారా కాదు
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా 42 శాతానికి పెంచి అమలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆర్డినెన్స్‌లు, జీవోల ద్వారా బీసీ రిజర్వేషన్లను తాము కోరుకోవడం లేదని స్పష్టంచేశారు. మొదటి నుంచీ బీఆర్ఎస్ ఈ విషయాన్ని పట్టుదలగా ముందుంచిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో రెండు బీసీ బిల్లులను ప్రవేశపెట్టినప్పుడు బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో సహకరించిందని గుర్తు చేసిన గౌడ్, ఆ బిల్లుల ఆమోదం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు విస్మరించారో వివరించాలని డిమాండ్ చేశారు. జీవో ద్వారా అమలు చేయడం అంత సులభమైతే గత 20 నెలల్లో ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే విధానాన్ని అనుసరించేవారే కదా అని అనుమానం వ్యక్తం చేశారు.

రెండు బిల్లులకు సహకరించినా, బీఆర్ఎస్‌ను విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు వాస్తవాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కోర్టుల్లో నిలిచేలా రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు తీసుకురావాలన్నదే తమ అభిమతమని స్పష్టంచేశారు.

### కేశవరావు మాటలు అర్థంకావట్లేదు

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బాగా వ్యవహరించిన కేశవరావు, కాంగ్రెస్‌లోకి వెళ్లాకే ఏమైందో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ఆయనకు ఏదైనా మిగితా 4వ పేజీలో

## దేశ నిర్మాణానికి కొత్త శక్తిగా యువత

- ప్రధాని మోడీ
- రోజ్‌గార్ మేళా 16వ ఎడిషన్‌లో 51,000 మందికి నియామక పత్రాలు పంపిణీ చేసిన ప్రధాని మోదీ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా నియమించబడిన 51,000 మంది ఉద్యోగార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నియామక పత్రాలు పంపిణీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమం రూ?జ్‌గార్ మేళా 16వ ఎడిషన్ లో భాగంగా 47 కేంద్రాల్లో ఒకేసారి నిర్వహించబడింది.

రైల్వే, హోంశాఖ, పోస్టల్ శాఖ, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, కార్మిక శాఖ వంటి కీలక కేంద్ర విభాగాల్లో నియామకాలు జరగనున్నట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామక పత్రాల పంపిణీ యథాప్రకారం కొనసాగుతోంది. ఇప్పటివరకు లక్షలాది మందికి శాశ్వత ఉద్యోగాలు లభించాయి. మీ అందరి విభాగాలు వేర్వేరు అయినా, దేశ సేవే మీ ధ్యేయం," అన్నారు. "రైల్వేలో మీరు భద్రతను బలోపేతం చేస్తారు. పోస్టల్ శాఖలో విధులు నిర్వహించేవారు గ్రామాల దాకా ప్రభుత్వ కార్యక్రమాలు తీసుకెళ్తారు. ఆరోగ్య రంగంలో 'హెల్త్ ఫర్ ఆల్' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తారు. ఆర్థిక వ్యవస్థలో చొరవ చూపించి పారిశ్రామిక పురోగతిని వేగవంతం చేస్తారు," అని వివరించారు.

"భారతదేశానికి యువతే అసలైన శక్తి. జనాభాలో ఎక్కువగా ఉన్న యువతను ఉపయోగించుకుంటే దేశానికి అప్రతిహత అభివృద్ధి సాధ్యమవుతుంది. మనం ప్రజాస్వామ్యంలో అతిపెద్ద దేశం. యువశక్తి, ప్రజాస్వామ్యం ఇవే భారత్ సంపద," అన్నారు ప్రధాని.

"ఇటీవల ఐదు దేశాల పర్యటన నుంచి వచ్చిన తర్వాత భారత యువత పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదరణను గమనించాను. ఆ పర్యటనలో జరిగిన ఒప్పందాలు భారత యువతకు ప్రయోజనకరంగా మారనున్నాయి," అని పేర్కొన్నారు. 2022 అక్టోబర్ 22న ప్రారంభమైన రూ?జ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 10 లక్షల మందికి నియామక పత్రాలు పంపిణీ చేసినట్టు కేంద్రం వెల్లడించింది. ప్రభుత్వ విభాగాల్లో ఖాళీలను తొలగిస్తూ సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు ఈ మిషన్ ఉపయోగపడుతోంది. ఉద్యోగార్థులు రైల్వే స్టేషన్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, పోలీస్ స్టేషన్లు, ట్యాక్స్ కార్యాలయాల్లో విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ మిషన్లను వేగంగా అమలు చేయడంతోపాటు, దేశాభివృద్ధి లక్ష్యాల వైపు మద్దతు లభిస్తున్నదని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పథకాలు మా ఘనతే

**● మంత్రి కోమటిరెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**

పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి, మాడుగులపల్లి, నల్లగొండ పట్టణాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి "నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం, తక్కువ ధరకు బియ్యం అందించడం వంటి పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వానిదే కీలక పాత్ర. ఈ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సేవ చేయడం మాకు అదృష్టంగా భావిస్తున్నాం" అని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా తిప్పర్తి మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



అదనపు హాల్‌ను మంత్రులు ప్రారంభించారు. అదే ప్రాంతంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడినట్లు తెలిపారు.

మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.14.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మండల కార్యాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. అంతేగాక, రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని కూడా ప్రారంభించారు.

**ఆర్టీసీలో 40 ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం**

నల్లగొండ ఆర్టీసీ డిపోలో 40 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రులు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అదనపు కలెక్టర్ నారాయణ అమిత్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్టు నుంచి సాగు నీటి విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో... సాగు అవసరాల కోసం సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను శనివారం విడుదల చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అధికారులు బీజీ కొత్తూరు వద్ద తొలి లిఫ్ట్ పంప్ హౌస్ నుంచి నీటిని వదిలారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో పెరిగినా, పూర్తిగా నీరు చేరకపోవడంతో ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా సీతారామ ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. రైతుల విజ్ఞప్తిని గమనించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే స్పందించి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సంప్రదించారు. పరిస్థితిని వివరించి, తక్షణమే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లతో శనివారం ఉదయం సమీక్ష నిర్వహించారు. అన్ని అంశాల పరిశీలన అనంతరం సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని విడుదల చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్యతో రైతులలో ఊరట నెలకొంది. పంటల రక్షణకు ఈ నీరు ఎంతగానో దోహదపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# బీసీ రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్‌ను విమర్శించడమే హాస్యాస్పదం



**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**బలగం టీవి, హైదరాబాద్**

బీసీ రిజర్వేషన్ల పెంపును తన విజయంగా ప్రకటిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన సమయంలో కవిత తీహార్ జైల్లో ఉన్నారని గుర్తుచేశారు. "ఆమె ఎప్పుడెప్పుడు బీసీల కోసం పోరాటం చేసింది? ఇప్పుడు తాను చేసిన గొప్ప కార్యక్రమంలా ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమే" అని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదని మహేశ్ గౌడ్ ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చారిత్రాత్మక నిర్ణయానికి కవిత క్రెడిట్ తీసుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు.

"తెలంగాణ సమాజం మొత్తం ఆమె మాటలపై నవ్వుకుంటోంది. కవిత నిజంగా బీసీల కోసం పోరాడిందా? జైలులో ఉండగానే రిజర్వేషన్లు సాధించిందా?" అంటూ ఎద్దేవా చేశారు.

"ఇప్పుడు కవిత ఏ పార్టీలో ఉన్నారు? ఆమె స్థానాన్ని, వ్యూహాన్ని, రాజకీయ భవిష్యత్తును బీఆర్ఎస్ సైతం స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. అలాంటి స్థితిలో ఆమె రిజర్వేషన్ల విషయంలో ఘనత తీసుకోవడమేంటి?" అని ప్రశ్నించారు. కులసర్వే అమలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి అంశాలు కాంగ్రెస్ హయాంలో తీసుకున్న విప్లవాత్మక చర్యలని పేర్కొన్నారు. ఇవి తెలంగాణలో సామాజిక న్యాయ పరిరక్షణకు కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని తెలిపారు. గతంలో ఎన్నో చట్టాల విషయంలో బీఆర్ఎస్ కేంద్రంలోని బీజేపీకి మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు బీసీలకు మేలు చేసే చట్టం గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా బీఆర్ఎస్ మౌనం దీర్ఘిస్తున్నదని విమర్శించారు. "కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకునే ధోరణితో విపక్షాలు వ్యవహరిస్తున్నాయి. మంచి పనులను అభినందించేందుకు కూడా మాజీ సీఎం కేసీఆర్‌కు మనసు రావడం లేదు" అని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు.

# చుక్కా రమేష్ కుటుంబానికి ఆర్థికసాయం

**బలగం టీవి, హైదరాబాద్**



కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపులకు బలై మరణించిన చుక్కా రమేష్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆర్థికసాయం అందించారు. శనివారం ములుగు జిల్లా చల్వాయిలోని రమేష్ నివాసానికి వెళ్లిన రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ రావు ఆర్థికసహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "చుక్కా రమేష్ మృతికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య" అని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలను చుక్కా రమేష్ వెలుగులోకి తేవడంతోనే, మంత్రి సీతక్క వర్గీయులు అతనిపై పోలీసులను ఉసిగొల్పారని ఆరోపించారు. రెండో వైపు, ఇందిరమ్మ కమిటీ పేరుతో పేదల నుంచి వసూళ్లు చేస్తున్నారని, రూ.50 వేల నుంచి లక్ష రూపాయలు లంచం ఇవ్వగలిగిన వారికి మాత్రమే ఇళ్లు కేటాయిస్తున్న దారుణం కొనసాగుతోందని వివరించారు. అర్హులు న్యాయంగా లబ్ధిదారులైనా, లంచం ఇవ్వలేనివారికి ఇళ్లు రాకుండా చేయడమే కాకుండా.. అప్పటివరకు ఇచ్చిన పట్టాలను కూడా రద్దు చేస్తున్నారని విమర్శించారు. ఇదే విషయంపై చుక్కా రమేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే ఆయన ప్రాణాలకు పొంపు తెచ్చిందన్నారు. చుక్కా రమేష్ మరణంపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసుల వేధింపుల కారణంగా చనిపోయిన రమేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలన్నారు. ఇప్పటికే జిల్లాలో జరిపిన వసూళ్లపై ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ అధికారుల ద్వారానే పట్టాలు అందజేయాలని సూచించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను వాడుకుని ప్రజాపక్షవాదులను చొప్పించాలనుకుంటే, బీఆర్ఎస్ ఊరుకోదు. పేదల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం. న్యాయ సహాయం కోసం బీఆర్ఎస్ లీగల్ సెల్ సన్నద్ధంగా ఉంది" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కూలిన నాలుగంతస్థుల భవనం

**ఇద్దరు మృతి, ఒక శిశువు సహా ఎనిమిది మందికి గాయాలు**

**బలగం టీవి, హైదరాబాద్**

ఢిల్లీ ఉత్తర తూర్పు ప్రాంతంలోని వెల్‌కమ్ ప్రాంతంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న భవన ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. కూలిన భవన శిథిలాల కింద కొంతమంది ఇంకా చిక్కుకొని ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉదయం 7:04 గంటల సమయంలో వెల్‌కమ్ పోలీస్ స్టేషన్‌కు నాలుగు అంతస్థుల భవనం కూలిన సమాచారం వచ్చింది. ఇది జంటా కాలనీ గల్లీ నం.5 వద్ద, ఇందిరా ఘాట్ రోడ్డుకు సమీపంగా ఉంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులకు, మూడు అంతస్థులు పూర్తిగా కూలిపోవడం గుర్తించబడింది. ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ చీఫ్ అతుల్ గార్గ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుపైగా ఫైరింజన్లు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి.

ఈ భవనంలో నివసిస్తున్న మట్లూబ్ అనే వ్యక్తి కుటుంబంతో పాటు మొత్తం 10 మంది ఈ భవనంలో ఉండగా, ప్రమాద సమయంలో



కొంతమంది బయట ఉన్నారు. ఈ కుటుంబంలోపాటు భవనం సమీపంలో ఉన్న కొంతమంది కూడా శిథిలాల్లో చిక్కుకున్నారు.

ప్రస్తుతం గాయపడిన ఎనిమిది మందిలో ఏడుగురిని జేపీసీ ఆసుపత్రికి, ఒకరిని జీటీబీ ఆసుపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు. శిథిలాల నుంచి పర్వేజ్ , అతని భార్య సిజా , 14 నెలల కుమారుడు అహ్మద్, తమ్ముడు నవేద్‌లతో పాటు మరో నలుగురు స్థానికులను రక్షించారు. అయితే పర్వేజ్ కుటుంబానికి చెందిన ఇద్దరు మృతులుగా ప్రకటించబడ్డారు ఒకరు పురుషుడు, మరొకరు మహిళగా గుర్తించారు.

ఈ ఘటనలో ఎదురుగా ఉన్న భవనానికి కూడా నష్టం వాటిల్లింది. అక్కడ నివసించే అనీస్ అహ్మద్ అంసారీ అనే వ్యక్తి కూడా గాయపడ్డారు. "విజృంభించిన శిథిలాలు మా ఇంటిపై పడ్డాయి. నేను కూడా గాయపడ్డాను. స్థానికులు, పోలీసులు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. ఇంకా కొంతమంది కింద ఉండొచ్చన్న అనుమానాలు ఉన్నాయి" అని తెలిపారు.

ప్రమాద సమయంలో పలువురు స్థానికులు ఉదయభాష్యం కోసం బయట ఉన్నారు. వారు తొలుత సహాయక చర్యల్లో పాల్గొని శిథిలాల కింద చిక్కుకున్నవారిని బయటకు తీశారు. ఆపై ఫైర్ సిబ్బంది వచ్చి రికవరీ కొనసాగించారు. భద్రతా దృష్టితో పరిసర భవనాలను ఖాళీ చేయించారు.

ఇద్దరు మృతి చెందిన విషయాన్ని ధ్రువీకరించిన తర్వాత, పొరుగింటి మహిళ ఆస్మా మాట్లాడుతూ.. "ఉదయం 7 గంటల సమయంలో ఒక్కసారిగా గట్టిగా శబ్దం విన్నాం. దుమ్ముతో చుట్టుపక్కల అంధకారం వలె అయ్యింది. కిందకు పరుగెత్తగా, మా పొరుగింటి భవనం నేలమట్టమైపోయింది. ఎంతమంది శిథిలాల్లో ఉన్నారో తెలియదు. కానీ ఆ భవనంలో 10 మంది కుటుంబ సభ్యులు నివసించేవారు" అని తెలిపారు.

# లోయలో పడిన వాహనం.. ఐదుగురు మృతి

**బలగం టీవి, హైదరాబాద్**




జమ్ము కశ్మీర్ రాష్ట్రం రాంబన్ జిల్లాలో శనివారం ఉదయం వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో యావర్ అహ్మద్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. యుక్రల్ పోగల పరిస్తాన్ ప్రాంతంలోని సేనాబాతిలో రోడ్డుపక్కన ఉన్న 600 అడుగుల లోయలో పర్యాటకుల వాహనం పడింది. రెస్క్యూ సిబ్బంది, అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జీతేంద్ర సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు లక్ష రూపాయలు, గాయపడిన 25 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతులు తౌఖర్ అహ్మద్, షకీల్ అహ్మద్, గాయపడిన వారు మహ్మద్ రఫీక్, అబ్దుల్ లతీఫ్, అజాజ్ అహ్మద్‌గా గుర్తించారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.



## వివేకానంద విద్యానికేతన్‌లో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం..

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అశోకనగర్ లో ఉన్న వివేకానంద విద్యానికేతన్ హై స్కూల్ లో శనివారం నాడు "పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం" వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ పోతరాజులు, పులివేషాలు, బోనాలు, రంగం ఎత్తే పూజారులు, శివసత్తులు, మరియు వివిధ అమ్మవార్ల అవతారాలలో అలరించారు. పాఠశాల సమీపంలోని వీధుల్లో చిన్నారులు తమ వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, బుచ్చారావు, మహేందర్ రెడ్డితో పాటు ఉపాధ్యాయునిలు కృష్ణవేణి, రమాదేవి, దేవేంద్ర, దివ్య, రేఖ, సౌజన్య, మాధవి, అక్షయ, మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఉత్సాహంగా సాగిన పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన పోలీస్, ప్రెస్ ఫ్రెండ్లి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఉత్సవంగా కొనసాగింది. మొదటగా పోలీస్( ఏ) టీం మరియు సిరిసిల్ల ప్రెస్ టీం మధ్య జరగిన మ్యాచ్ లో పోలీస్ (ఏ )టీం గెలుపొందగా ,రెండవ మ్యాచ్ లో పోలీస్ (బీ) టీం మరియు వేములవాడ ప్రెస్ మధ్య జరుగగా వేములవాడ ప్రెస్ టీం గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ (ఏ) టీం 10 ఓవర్లలో 77 పరుగులు చేయగా, అనంతరం వేములవాడ ప్రెస్ టీం 10 ఓవర్లలో 73 పరుగులుకి ఆల్ అవుట్ కాగా, పోలీస్ (ఏ) టీం 4 పరుగుల తేడాతో గెలుపొందింది.క్రికెట్ పోటీలో భాగంగా ఎస్పీ మహేష్ బి. గితే స్వయంగా బ్యాటింగ్,బౌలింగ్ చేసి ఉత్సాహపరిచారు.క్రికెట్ మ్యాచ్ ప్రారంభించే ముందు ఇటీవల గుండెపోటుతో మరణించిన సిరిసిల్ల రిపోర్టర్ ప్రసాద్ కి నివాళులు అర్పించి,మౌనం పాటించినారు. అనంతరం గెలుపొందిన జుట్టుకు బహమతులు అందించారు. ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని, నిత్యం బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు కొంత సేపు ఆహ్లాదకరంగా గడిపారు అని అన్నారు. ప్రెస్, పోలీసుల మధ్య మంచి సత్సంబంధాలు ఉండడానికి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం జరిగిందని, ప్రతి సంవత్సరం ఒక సారి ఈ విధంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆటవిడుపుతో పాటు మంచి టీమ్ స్పిరిట్ వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ అధికారులు,పాత్రికేయులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు..

**బలగం టీవీ, వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా అగ్రహారం శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించి, మొక్కల నాటి, పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్ర మహేష్ జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, జింక అనిల్, ఏరెడ్డి రాజిరెడ్డి, గుండెకార్ల లక్ష్మణ్, నర్సింగ్ గోజు శంకర్, చంద్రగిరి ప్రశాంత్, ముద్దంగుల అంజన్న, గోనె భాస్కర్ శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రగుక్కుల రమేష్, చల్ల నర్సయ్య, తిప్పరవేణి రాజు, చింతకుంట నరసయ్య, చిట్ల అంజన్న, సోలంకి అరవిందు, రెడ్డవేరి రాజు, రెడ్డవేని శ్రీనివాస్, నాగుల సురేష్, బూర శేఖర్, ముద్దంగుల రవి, పోచంపల్లి భాను, జింక శేఖర్, బాలకృష్ణ, కంసాని రాము, జక్కుల మధు, గంట మహేష్, తరంగాని మల్లేశం, గుగ్గిళ్ళ చిన్న రేగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదు

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,తంగళ్ళపల్లి:**



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ మంజూరు పత్రాలు ఎంపీడీఓ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇండ్లలోకి వెంటనే వెళ్ళాలని,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందనిఅన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాళ్లపేట గ్రామంలో నిర్మిస్తున్న ఇండ్లు తుది దశకు చేరుకున్నాయని అన్నారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై పీడీ హౌసింగ్, ఎంపీడీఓను అభినందించారు.

**మట్టి కోసం ఆందోళన చెందవద్దు..**

మట్టి కోసం లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తమ గ్రామంలోని చెరువు, తమకు సంబంధించిన పొలంలో ఉన్న మట్టిని వినియోగించుకునేందుకు గ్రామ పంచాయితీ కార్యదర్శి ద్వారా తహశీల్దార్ కు తెలిపితే ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ఆ మట్టిని గృహ నిర్మాణ అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమం లో కెకె.మహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప, వైస్ చైర్మెన్ నర్సింగం, పీడీ హౌసింగ్ శంకర్, డీపీఓ షర్ఫుద్దీన్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లు.. స్థానిక ఎన్నికలకు మార్గం సుగమం..

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం వీర్నపల్లి మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్**

**బలగం టీవీ, వీర్నపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వీర్నపల్లి మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆర్. కృష్ణయ్య ఆదేశాలు, జిల్లా అధ్యక్షులు మేకల పరుశురాముల సూచనల మేరకు మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్ అయిందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. ఈ నిర్ణయంతో స్థానిక సంస్థలలో బీసీల ప్రాతినిధ్యం పెరగనుందని, ఎవరూ కోర్టును ఆశ్రయించకుంటే సెప్టెంబర్ నెల ఆఖరిలోగా గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నెల రోజుల్లో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి సెప్టెంబర్ నెల వరకు ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి గడువు విధించిన విషయం తెలిసిందేనని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీ కుల గణన చేపట్టి విద్యా, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల హామీ మేరకు కుల గణన చేపట్టి ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదం తెలిపితే ప్రభుత్వం రిజర్వేషన్ సంబంధించి జీవోను జారీ చేయనుందని, ఈ జీవోను సవాల్ చేస్తూ ఎవరూ కోర్టును ఆశ్రయించకుండా ఉండేందుకు ముందస్తుగా కోర్టులో కేవియట్ దాఖలు చేయాలని నిర్ణయించిందని పరమాల మల్లేశం యాదవ్ వివరించారు.

30% సీట్లను జనరల్ కు కేటాయించనున్నారని, వాటిలో కూడా బీసీలు పోటీ చేసి తమ ప్రాతినిధ్యాన్ని పెంచుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. బీజేపీ పార్లమెంట్ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారందరూ కూడా బీసీల పక్షాన ఉండి పార్లమెంట్‌లో ఆమోదింప చేయాలని బీజేపీ ప్రభుత్వానికి తాము తెలుపుకుంటున్నామని అన్నారు. బీసీల పక్షాన ఉన్న ప్రభుత్వాలను బీసీలు ఆదరిస్తారని సూచించారు.

అదేవిధంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ కనమేని చక్రధర్ రెడ్డి కి, సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి కి, రాష్ట్ర ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, అనుబంధ సంఘాలకు, జిల్లా నాయకత్వానికి బీసీలకు 42 శాతం సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా బీసీ కుల బంధువులకు అందరికీ మండల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. బీసీ జనరల్ స్థానాలు వస్తే బీసీల నుంచి వీర్నపల్లి మండలంలో జాతీయ బీసీ మండల అధ్యక్షులు పరమాల మల్లేశం యాదవ్ గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరిని వార్డ్ నెంబర్లను, సర్పంచులను మరియు జెడ్పిటిసి గా కూడా మల్లేశం యాదవ్ బరిలో ఉంటారని, అందరిని బరిలో ఉంచుతామని నిర్ణయించుకోవడం జరిగిందని తెలిపారు. బీసీ కుల బంధువులు అందరూ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మన బీసీ ఓటు శాతాన్ని పెంచుకోవడం కోసం అందరూ ఏకధాటిగా రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు ఉపాధ్యక్షులు సీర్ల శ్రీనివాస్, సలహాదారుడు దేశ సత్తయ్య, అధికార ప్రతినిధి నరేందర్, కోశాధికారి తిరుపతి, కార్యదర్శి ఆకుల మహేందర్, కళాకారుల మండల అధ్యక్షుడు నేరెళ్ల ముత్యం, కార్యవర్గ సభ్యులు పిట్ల రాజేశం, దేశరాజ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం..

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ కనిమేని చక్రధర్ రెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ గుండెపోటుతో మరణించడంతో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ కనిమేని చక్రధర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ప్రసాద్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఓ మంచి జర్నలిస్టును కోల్పోవడం జర్నలిస్టు లోకానికి తీరని లోటని చక్రధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున, కాంగ్రెస్ పార్టీ తరపున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతుడు ప్రసాద్ కుటుంబానికి తనవంతు ఆర్థిక సహాయంగా రూ. 5,000 అందజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి సత్తు శ్రీనివాస్ రెడ్డి, అన్నాల్దాస్ భాను, ఆరుట్ల మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ తెప్పతో పాటు బస్ షెల్టర్ నిర్మించాలని ఎమ్మెల్యే కు వినతి

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక ఆర్ అండ్ ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్ప, కరీంనగర్ వేములవాడ ప్రధాన రహదారిలోని బస్ స్టాప్ వద్ద బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు నాగుల వంశీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగుల వంశిగౌడ్ మాట్లాడుతూ.. ఆర్ అండ్ ఆర్ కాలనీకి వచ్చిన అనంతరం కాలనీలో బతుకమ్మ తెప్ప లేకపోవడంతో ప్రతి ఏడాది బతుకమ్మ నిమజ్జనంకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్పారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో బతుకమ్మ తెప్ప నిర్మాణానికి స్థలం ఏర్పాటు చేశారని, నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# మొదటి ఇన్నింగ్స్‌లో స్కోర్లు సమం



- టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులకు ఆలౌట్
- కేఎల్ రాహుల్ సెంచరీ

**బలగం టీవీ, హైదరాబాద్**

లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరుగుతున్న భారత్–ఇంగ్లండ్ మూడో టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 119.2 ఓవర్లలో 387 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు, ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ కూడా తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులే చేసింది. రెండు జట్ల తొలి ఇన్నింగ్స్ స్కోర్లు సమం కావడంతో ఉత్కంఠ రేపుతోంది.

మూడో రోజు ఆటలో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (100) సెంచరీతో అదరగొట్టాడు. రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) అర్ధసెంచరీలతో జట్టుకు బలం చేకూర్చారు. కరుణ్ నాయర్ (40), నితీశ్ కుమార్ రెడ్డి (30) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 3 వికెట్లు, జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ చెరో 2 వికెట్లు తీశారు. యశస్వి జైస్వాల్ (13), శుభ్‌మన్ గిల్ (16) నిరాశపరిచారు.

అయితే భారత టెయిలెండర్ల వైఫల్యంతో చేజేతులా ప్రత్యర్థికి వికెట్లు ఇచ్చేసి పైచేయి సాధించే ఛాన్స్‌ను వదులకుంది. టీ సెషన్ తర్వాత వాషింగ్టన్ సుందర్(21 నాటౌట్)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన జడ్డూను వోక్స్ వెనక్కి పంపగా.. ఆ తర్వాత ఆకాశ్ దీప్‌ను కార్సే ఔట్ చేశాడు. చివరి వికెట్‌గా సుందర్ వెనుదిరగడంతో 387కే గిల్ సేన ఆలౌటం య్యింది. దాంతో, ఆధిక్యం సాధించాలనుకున్న భారత జట్టు స్కోర్ సమం చేసిందంతే.

అనంతరం ఇంగ్లండ్ బ్యాటింగ్‌కు దిగగా.. బుమ్రా మూడో రోజు ఆటలోని చివరి ఓవర్ వేసాడు. ఈ ఓవర్‌లో హైడ్రామా చోటు చేసుకుంది. ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలీ.. పదే పదే టైమ్ వృథా చేసే ప్రయత్నం చేశాడు. దాంతో భారత ఆటగాళ్ల అతనితో వాగ్వాదానికి దిగారు. శుభ్‌మన్ గిల్ అయితే.. కాస్త ధైర్యం తెచ్చుకో అని చెప్పాడు. సిరాజ్ కూడా తన నోటికి పనిచెప్పాడు. అంపైర్ కలగజేసుకొని ఆటగాళ్లను వారించారు. జాక్ క్రాలీ ఆచితూచి ఆడి బుమ్రా ఓవర్‌ను ముగించాడు. ఆ వెంటనే అంపైర్లు ఆటను నిలిపేసారు. ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ వికెట్లు కోల్పోకుండా 2 పరుగులు చేసింది.



## వింబుల్డన్‌కు కొత్త రాణి

- విజేతగా అవతరించిన ఇగా స్వియాటెక్
- అదిరిన ఆటతో టైటిల్ విజేత
- అమెరికా క్రీడాకారిణి అమందా అనిస్మోవాకు షాక్

**బలగం టీవీ, హైదరాబాద్**

వింబుల్డన్ టెన్నిస్ చరిత్రలో మరో కొత్త అధ్యాయం నమోదైంది. పోలాండ్‌కు చెందిన స్టార్ ప్లేయర్ ఇగా స్వియాటెక్ మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్లో అద్భుతంగా ఆడి, అమెరికా యువ సంచలనం అమందా అనిస్మోవాపై ఏకపక్షంగా విజయం సాధించింది.

ఫైనల్‌లో అమందాపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన స్వియాటెక్ 6–0, 6–0 తేడాతో విజయం సాధించింది. వింబుల్డన్ 114 ఏళ్ల చరిత్రలో ఫైనల్లో ఒక్క గేమ్ కూడా గెలవలేక ఓడిన తొలి ప్లేయర్‌గా అమందా రికార్డు సృష్టించింది. ఈ విజయంతో స్వియాటెక్ తన కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. విజయం అనంతరం కోర్టులోనే గెంతులు వేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేసిన ఆమె, తర్వాత తన టీమ్, కుటుంబ సభ్యులతో విజయాన్ని పంచుకుంది. వింబుల్డన్ టోర్నీకి ఫేవరెట్‌గా ఎంట్రీ ఇచ్చిన స్వియాటెక్, మొదటి నిమిషం నుంచి ఆటపై పట్టు సాధించింది. మొదటి సెట్‌లో అమందాకు ఒక్క అవకాశమూ ఇవ్వకుండా 6–0 తేడాతో ముగించింది. అదే జోరుతో రెండో సెట్ కూడా ముగించి ట్రోఫీపై హక్కు సాధించింది.

# దేశ సమగ్రతను కాపాడిన మహానాయకుడు అంబేద్కర్

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్

**బలగం టీవీ, హైదరాబాద్**

"భారతదేశ సమగ్రతను కాపాడిన మహానాయకుడు బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అమ్బేద్కర్" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశంసించారు. "ఒక్క దేశం – ఒక్క రాజ్యాంగం" అనే తత్వాన్ని గట్టిగా నిలబెట్టిన దూరదృష్టి గల నాయకుడిగా ఆయనను కొనియాడారు. వారు శుక్రవారం ఓస్మానియా విశ్వవిద్యాలయం టాగోర్ ఆడిటోరియంలో జరిగిన "భారత రాజ్యాంగం %–% బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాత్ర" అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు.

జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, "భారతదేశం వంటి సమాఖ్య వ్యవస్థలో ఒక్కటైన పౌరసత్వాన్ని అమలు చేయాలన్నది డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం" అని తెలిపారు. అమెరికాతో పోల్చుతూ, అక్కడి రాష్ట్రాలకు తమ స్వంత రాజ్యాంగాలు, డ్యూయల్ సిటిజన్‌షిప్ ఉండగా మన దేశంలో ఒకే రాజ్యాంగం ఉండటం ఒక విశిష్టత అని అన్నారు.

1951లో జరిగిన తొలి సవరణతోనే సామాజిక, విద్యా రంగాల్లో వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక నిబంధనలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాజ్యాంగం స్థిరంగా ఉండేలా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సవరణలకు అవకాశం కల్పించేలా అమ్బేద్కర్ రూపొందించారని చెప్పారు.



"న్యాయసాధనల హక్కు లేకుండా మౌలిక హక్కులకు అర్థం లేదు. అందుకే ఆర్టికల్ 32ను రాజ్యాంగానికి ప్రాణంగా అంబేద్కర్ పేర్కొన్నారు" అని తెలిపారు. ఇది పౌరులకు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఇస్తుందన్నారు. 1973లో కేసవానంద భారతి తీర్పు ద్వారా రాజ్యాంగ సవరణ అధికారం పార్లమెంటుకు ఉన్నా, మౌలిక నిర్మాణాన్ని మార్చలేరు అనే నిబంధన నిలిచిపోయిందని గుర్తు చేశారు. "రాజ్యాంగం ప్రజల హక్కులకు, ప్రభుత్వ వైఫల్యాలకు మధ్య ఒక రక్షణ కవచంగా మారింది" అని అన్నారు.

ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ మాట్లాడుతూ, "ఎంత మంచి రాజ్యాంగమైనా, దానిని అమలు చేయేవారి మంచితనమే నిజమైన శక్తి" అని అన్నారు. హైదరాబాద్ దళితులకు నీటి ఎద్దడి ఏర్పడినప్పుడు అంబేద్కర్ చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. నిజాం ఆఫర్ చేసిన చీఫ్ జస్టిస్ పదవిని తిరస్కరించి, సామాన్యులకు న్యాయం కోసం పని చేసినట్లు వివరించారు. తాత్కాలిక తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ, శ్రీలంక రాజ్యాంగం 14 ఏళ్లకే విఫలమైన దాన్ని గుర్తు చేస్తూప్రజల తత్వమే రాజ్యాంగానికి జీవం అని అన్నారు.

ఓస్మానియా వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం 64 శాతం విద్యార్థులు మహిళలే అన్నదే దీనికి నిదర్శనమన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న తమ సంస్థ అని చెప్పారు.

## ప్రభుత్వ సంకల్పానికి బీసీలు అండగా నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే నిష్ణాతులైన న్యాయవాదులను నియమించి వాదనలు వినిపిస్తాం. బీసీ రిజర్వేషన్ల కోసం ఇంకా ఏం చేయాలన్నా అందుకు సిద్ధంగా ఉన్నాం. నా చిత్తశుద్ధిలో లోపం లేదు. మా నిబద్ధతను ఎవరూ ప్రశ్నించలేరు. అన్ని వర్గాలతో పాటు అసెంబ్లీలో సమగ్రం గా చర్చించి అందరి అభిప్రాయాలను తీసుకున్నాం. కుల గణన డేటా వంద శాతం డిజిటలైజ్ చేశాం. భవిష్యత్తులో ఎవరూ ఛాలెంజ్ చేయడానికి వీలులేకుండా డేటాను భద్రపరిచాం.సామాజిక న్యాయం చేయాలన్న లక్ష్యంతో ఎన్నో అవాంతరాలు ఎదురైనప్పటికీ అన్నింటినీ అధిగమించి రాష్ట్రంలో కులగణన పూర్తి చేశాం. పక్కా ప్రణాళికతో పూర్తి పారదర్శకంగా, శాస్త్రీయంగా కులగణన పూర్తి చేశాం. ఏడాది కాలంలో ఈ ప్రకియ పూర్తి చేసి ఫిబ్రవరి 4 వ తేదీని సామాజిక న్యాయ దినోత్సవంగా ప్రకటించుకున్నాం. కులగణన విషయంలో తెలంగాణ తీసుకున్న నిర్ణయం దేశాన్ని ప్రభావితం చేసింది. తెలంగాణలో కులగణన చేయడంతో ఆ ఒత్తిడికి లొంగి కేంద్రం 2026 లో జరిగే జన గణనలో కుల గణనను చేర్చించింది. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదని కొందరు చేస్తున్న విమర్శలు అర్థం లేనివి. బీసీ రిజర్వేషన్లకు 9 వ షెడ్యూల్ లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది" అని ముఖ్యమంత్రి కుల గణన, రిజర్వేషన్ల అంశంపై సమగ్రంగా వివరించారు. రిజర్వేషన్లను కాపాడుకునే విషయంలో అన్ని ప్రయత్నాలు చేస్తూ, అందరం కలిసికట్టుగా పని చేద్దామని చెప్పారు.

## బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగానే అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

జరిగినా పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాల్సిన అవసరం లేదన్న ఆయన వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని అన్నారు. బీసీ బిల్లుల విషయంలో బీజేపీ నేతలు మౌనం వీడాలని, ఆ బిల్లుల ఆమోదం కోసం వారి చొరవ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమాధానం చెప్పాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రమే కాదు.. విద్య, ఉద్యోగాల్లో కూడా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రవేశ ప్రక్రియ జరుగుతున్న అన్ని కోర్సుల్లో ఈ రిజర్వేషన్లను పాటించాలని కోరారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీఆర్ఎస్ నేతలు సదానందంగౌడ్, కురవ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే స్పెషల్ సాంగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

సూపర్‌స్టార్ రజినీకాంత్ ప్రధాన పాత్రలో లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్టైనర్ "కూలీ" చిత్రం భారీ అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ప్రత్యేక గీతంలో మెరవగా, ఆ పాట ప్రస్తుతం యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో శుక్రవారం విడుదలైన 'మోనికా' పాటకు అన్ని భాషల్లోనూ విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తమిళంలో భారీ వ్యూస్ రాబడుతోంటే, తెలుగులో యూట్యూబ్ ట్రెండింగ్‌లో నెంబర్ 1 స్థానంలో కొనసాగుతోంది. అనిరుద్ రవిచందర్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ పాటలో పూజా హెగ్డే స్టెప్పులు, సౌబిన్ సాహిర్ వినిపించిన పల్లవులు హైలైట్‌గా నిలిచాయి. ఈ పాట హై ఎనర్జీని చాటిస్తూ ప్రేక్షకుల్లో హైప్‌ను పెంచగా, సినిమా కోసం ఉత్కంఠ మరింత పెరిగింది. ఇక 'కూలీ' చిత్రాన్ని ఆగస్ట్ 14న పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర వంటి స్టార్స్ కీలక పాత్రల్లో కనిపించనుండటం మరింత ఆసక్తికరంగా మారింది.



## వింటారా సరదాగా టీజర్ విడుదల

సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న యువతర కథా చిత్రం 'వీసా– వింటారా సరదాగా' టీజర్‌ను శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సినిమాతో ఉద్భవ్ రఘు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో అశోక్ గల్లా, శ్రీగౌరీ ప్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అమెరికా నేపథ్యంలో సాగుతున్న ఈ కథ టీజర్‌లోనే ఆసక్తికరంగా చూపించబడింది. ఎన్నో కలలతో విదేశాలకు వెళ్ళిన తెలుగు విద్యార్థుల జీవితాన్ని, వారి స్నేహం, ప్రేమ, సంఘర్షణలను ఈ చిత్రంలో హృద్యంగా చిత్రీకరించారు.